కేటీఆర్‌ను కలిసిన సలావుద్దీన్ లోది



కేటీఆర్‌తో సమావేశమైన మహమ్మద్ సలావుద్దీన్ లోది

చార్మినార్: మైనార్టీల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని.. దీంతో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటర్లు ఉన్నారనే విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివరించినట్లు బీఆర్ఎస్ చార్మినార్ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది తెలిపారు. ఈ మేరకు దాసోజు శ్రవణ్ కుమార్‌తో కలిసి కేటీఆర్‌తో సమావేశమయ్యామన్నారు. రాబోయే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి కచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. ఈ మేరకు తామంతా జూబ్లీహిల్స్‌లో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి స్పందించిన ఆయన దాసోజు శ్రవణ్‌తో కలిసి పనిచేయాలని ఆదేశించారన్నారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం గత పదేళ్లుగా ఎంతో కృషి చేసిందన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సుల్తాన్‌బజార్: నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గులాబ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే 72 అడుగుల వారాహీ దుర్గామాత విగ్రహాన్ని దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టిస్తుందని తెలంగాణ మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శుక్రవారం విక్టరి ప్లే గ్రౌండ్‌లోని నిర్మాణ దశలో ఉన్న అమ్మవారి విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..25 ఏళ్లుగా గులాబ్ శ్రీనివాస్ నేతృత్వంలో 72 అడుగుల అమ్మవారి విగ్రహంతో నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు.

'యాత్రాదానం'ను సద్వినియోగం చేసుకోవాలి

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ ప్రవేశపెట్టిన 'యాత్రాదానం' ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని ఫారూఖ్‌నగర్ డిపో మేనేజర్ జి.వేదవతి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అనాథ, పేద విద్యార్థులు, మానసిక దివ్యాంగ విద్యార్థులకు ఉత్సాహం కల్పించడానికి ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశాలతో సామాజిక సేవా దృక్పథం ఉన్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యాత్రాదానం టూర్ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నగర పరిసర ప్రాంతాల్లోని స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, సేవాభావం ఉన్న వారు విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక బస్సులు కేటాయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫారూక్‌నగర్ డీఎం ఫోన్ నంబర్: 73373 46169, 85009 08609లో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



కేటీఆర్‌ను కలిసిన మేకల విష్ణువర్ధన్

అబిడ్స్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం యువజన విభాగం నాయకులు మేకల విష్ణువర్ధన్ కలిశారు. శుక్రవారం కేటీఆర్‌ను కలిసి గోషామమల్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

గోల్కొండ: బస్టాప్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళ మెడలోంచి చైన్ లాక్కొని పారిపోతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మెహిదీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 19న మెహిదీపట్నంలోని బస్టాప్ వద్ద రాపల్లె మౌనిక బస్టాప్ వద్ద నుంచి 300 నెంబర్ బస్సును ఎక్కడానికి పరిగెత్తుతుంది. ఇంతలోనే ఓ వ్యక్తి వచ్చి ఆమె మెడలోని చైన్ లాక్కొని పరుగులు తీశాడు. ఆమె వేసిన కేకలను విన్న ప్రయాణికులు చైన్ స్నాచర్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. కాగా పోలీసులు నిందితుడిని షేక్ ఆలీమ్‌గా గుర్తించారు. మహారాష్టకు చెందిన షేక్ ఆలీమ్ రాజేంద్రనగర్‌లో కూలీగా పని చేస్తున్నాడు. అతడి నుంచి చైన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ట్రా'ఫికర్'

- జాతీయ రహదారి నీట మునగడంతో ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రద్దీగా జియాగూడ కార్వాన్ రహదారి

జియాగూడ: మూసీనది వరద నీటికి జాతీయ రహదారి ముంపునకు గురవుతుంది. దీంతో వాహనాలు జియాగూడ, కార్వాన్ ప్రాంతాల గుండా వెళ్తుండడంతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పురానాపూల్ వద్ద మూసీనది వరద నీరు జాతీయ రహదారి తరచూ ముంచెత్తుతుంది. పురానాపూల్ చౌరస్తా నుంచి వంద ఫీట్ల జాతీయ రహదారి రామ్‌సింగ్‌పురా వరకు గల రహదారి నిత్యం రాకపోకలకు అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యకరంగా ఉండేది. జాతీయ రహదారి మూసీనది నీటి కారణంగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

మూసీ నదిలోనే రహదారి నిర్మాణం..

25 ఏళ్ల క్రితం మూసీ నదిలో వేసిన రోడ్డు మూసీ వరదలకు కొట్టుకుపోయింది. 10 ఏళ్ల క్రితం తిరిగి రోడ్డు నిర్మాణం పనులు మొదలై పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో తరచూ జియాగూడ మేకలమండి, సబ్జిమండికి వచ్చే వాహనాల మళ్లింపుతో ట్రాఫిక్ సమస్య తీరింది. అయితే వర్షాకాలంలో భారీ వర్షాలు పడ్డ ప్రతిసారి మూసీకి వరదలు రావడం జాతీయ రహదారి నీటితో మునగడం సాధారణంగా మారింది. అప్పట్లో మూసీనదిలో రహదారి నిర్మాణం జరగడం వల్లే రహదారి నీట మునుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

గంటల తరబడి ట్రాఫిక్ జాం..

జాతీయ రహదారి నీట మునగడంతో పురానాపూల్ నుంచి హైటెక్ సిటీ, అత్తాపూర్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలకు వెళ్లే ట్రాఫిక్ జియాగూడ, కార్వాన్ ప్రాంతాల గుండా మళ్లించడంతో ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోతుంది. 2జే బస్సుల రాకపోకలు, చెత్త డంపింగ్ యార్డ్‌కు వచ్చే భారీ లారీలు, స్వచ్ఛ్ ఆటోలు, మేకలమండికి వచ్చే జీవాల లారీల వల్ల ఈ ప్రాంతాలు పూర్తిగా ట్రాఫిక్ మయంగా మారాయి.



నీట మునిగిన జాతీయ రహదారి

జాతీయ రహదారి ఎత్తు పెంచాలి..



పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు గల రహదారిలో సమర్థ నారాయణ ఆశ్రమం నుంచి పురానాపూల్ వంతెన వరకు రహదారి ఎత్తు పెంచితే రహదారి మునగదు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తదు.

– లక్ష్మీనారాయణ, ఇందిరానగర్

తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనం



పురస్కారాల గ్రహీతలతో తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వకళా వైభవం పేరిట సంస్థ 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ బతుకమ్మ జన్మస్థలం నుంచి ప్రారంభించబడిన సంస్థ నేడు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ సుందర తిరుమలచారికి జీవన సాఫల్య పురస్కారం, సుప్రీంకోర్టు న్యాయవాది ఎ.పద్మాచారి, హైదరాబాద్ ఆర్‌డీఓ ఇ.వెంకటాచార్యులకు సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు కేఆర్.నాగరాజు, ఐపీఎస్ అధికారి రావుల గిరిధర్, సీసీఎస్ ఏసీపీ కేఎం.కిరణ్‌కుమార్, సంస్థ అధ్యక్షుడు శాంతికృష్ణ పాల్గొన్నారు.

నాలాల విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి



నాలా విస్తరణ పనులను అడిగి తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్

చార్మినార్: వరద నీటి సమస్యలు తలెత్తకుండా సాధ్యమైనంత వెంటనే నాలా విస్తరణ పనులను పూర్తి చేయాలని చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి యాకుత్‌పురా, యశ్రఫ్ నగర్, లండన్ బ్రిడ్జి, మౌలా కా చిల్లా, రంగేళి కిడికి, అమన్ నగర్–ఏ, గంగా నగర్ నాలా, మాతాకి కిడికి, డబీర్‌పురా నాలా ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనుల పురోగతిపై సంబంధిత ప్రాజెక్ట్స్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తర్ గట్టి డివిజన్‌లోని రంగేళి కిడికి, మౌలా చిల్లా ప్రాంతంలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ జోనల్ కమిషనర్‌కి వివరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ విభాగం ఎస్ఈ శ్రీనివాస్, చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, సంతోష్‌నగర్, చార్మినార్ సర్కిళ్ల ఈఈలు దేవేందర్, హరికిశోర్ పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో కార్మికుల వాటాను ప్రకటించండి



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్, టీబీజీకెఎస్ నేతలు

నాంపల్లి: సింగరేణి లాభాల్లో కార్మికుల వాటాను ప్రకటించడంలో జాప్యం చేపట్టడంపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్ ఎదుట బీఆర్ఎస్ అనుబంధ సంస్థ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ బొగ్గు బ్లాకులు ప్రైవేటీకరణ చేయకుండా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. సింగరేణి ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ..మా వాట మాకు తేల్చాలని కోరితే అక్రమ అరెస్టులు చేయడం బాధాకరమని మండిపడ్డారు. వాటాను ప్రకటించే వరకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

'విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే'



మాట్లాడుతున్న రాంచందర్‌రావు

దూద్‌బౌలి: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం శాగంజ్ ప్రాంతంలోని రాజస్థానీ హిందీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి దేశభక్తి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలన్నారు. మోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలు, వ్యాసరచన తదితర విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిల్పారెడ్డి, ఉమామహేందర్, పాండుయాదవ్, రేణు సోని, మెఘారాణి అగర్వాల్, ఉమేష్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

నాలాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మల్లేపల్లిలో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతున్న అనురాగ్ జయంతి

నాంపల్లి: నియోజకవర్గంలోని నాలాలపై ప్రత్యేక దృష్టిసారించాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి కలిసి మెహిదీపట్నం సర్కిల్–12 పరిధిలోని వివిధ శాఖల అధికారులను తమ వెంట బెట్టుకుని పలు డివిజన్లలోని బస్తీలను పర్యటించారు. ఉదయం 7 గంటలకు అహ్మద్ నగర్ డివిజన్‌లోని ఫస్ట్‌లాన్సర్‌లో ప్రారంభమైన పర్యటన ఉదయం 9 గంటలకు మల్లేపల్లి డివిజన్‌లో ముగిసింది. అహ్మద్‌నగర్, రెడ్‌హిల్స్, మల్లేపల్లి డివిజన్లలోని మురుగునీటి నాలాలను, పాడైపోయిన రోడ్లను సమగ్రంగా పరిశీలించారు. అఫ్జల్‌సాగర్ నాలాలో ఇద్దరు యువకులు ఇటీవల కొట్టుకునిపోయిన నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల చేపట్టిన పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందులో భాగంగానే మాసబ్‌ట్యాంక్ నుంచి అఫ్జల్‌సాగర్ వరకు విస్తరించిన నాలాను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్ దశరథ్, పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎల్.స్వామి నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లాల్ సింగ్, సెక్షన్ ఆఫీసర్లు సునిత, ప్రకాష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి..

అఫ్జల్‌సాగర్ మన్గార్ బస్తీలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని బీజేపీ నాంపల్లి ఇన్‌చార్జి రాహుల్‌చంద్ర జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికేతరులకు కాకుండా అక్కడ నివాసం ఉండే వారికే కేటాయించాలని కోరారు. అఫ్జల్‌సాగర్ నాలాలో గల్లంతైన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, వీరి కుటుంబాల్లో ఒకరి చొప్పున ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్ అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు రాహుల్‌చంద్ర పేర్కొన్నారు.

'ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం'



వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఆహ్వానపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ తెలిపారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్త్‌కు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ నెల 25న తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఫీవర్ ఆసుపత్రిలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా మంత్రి దామోదర రాజనర్సింహ హాజరు కానున్నట్లు తెలిపారు. స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, ఆనంద్‌కుమార్, రాబర్ట్ బ్రూస్ పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుందాం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బతుకమ్మ విశిష్టత–ఆచరణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కొన్ని తరాలుగా గ్రామీణ మహిళల నోళ్లలో నానుతున్న బతుకమ్మ పాటల స్ఫూర్తిని వెలుగులోకి తీసుకురావాలని కోరారు. డీజే మోతలతో కాకుండా ఆటపాటలతో సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి కన్వీనర్ ప్రొఫెసర్ కోదండ రామ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సలహామండలి సభ్యులు బి.నర్సింగ్ రావు, భవానిరెడ్డి, జూపాక సుభద్ర, బి.శివకుమార్, ఖాజాపాషా పాల్గొన్నారు.

ఏరోబిక్స్‌లో చిన్నారులను ప్రోత్సహించాలి



గెలుపొందిన విద్యార్థులతో ధాత్రి తదితరులు

అబిడ్స్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను యోగా, ఏరోబిక్స్ వంటి అంశాలలో ప్రోత్సహించాలని అఖిల భారత స్పోర్ట్స్ ఏరోబిక్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంజి.ధాత్రి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ ఏరోబిక్స్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైఫాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మొదటి స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ ఏరోబిక్ ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..నగర వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో భారతీయ విద్యాభవన్ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకోగా సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థులు 2వ బహుమతిని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి రాజాసింగ్, కోచ్‌లు జి.బ్రహ్మనంద ప్రసాద్, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ సేవలు స్ఫూర్తిదాయకం



విజయనగర్‌కాలనీ: బీఎస్ఎఫ్ సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఎ.సిద్ధిఖి అన్నారు. విజయనగర్‌కాలనీ బీఎస్ఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.ఎ.సిద్ధిఖి మాట్లాడుతూ..పేదలు, అభాగ్యులకు భీమ్ సైనిక్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని కొనియాడారు. భీమ్ సైనిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కలకోటి సత్యనారాయణ మాట్లాడుతూ..మంత్రి వివేక్ వెంకటస్వామి తమ సంస్థకు అన్నివేళల చేయూతనిస్తూ అండదండగా నిలవడం తమకు నూతనోత్సాహాన్ని ఇస్తుందన్నారు. బీఎస్ఎఫ్ సభ్యులు విద్యాసాగర్, జమాల్ ఖాన్, తిరుమల్, ఎస్.సంపత్, ఈ రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సురేశ్ కుమార్



మహ్మద్ నయీముద్దీన్

డబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బొడసింగి సురేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన రాచకొండ రవీందర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సురేశ్‌కుమార్ బాధ్యతలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

రెయిన్‌బజార్ డీఐగా మహ్మద్ నయీముద్దీన్..

రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ నయీముద్దీన్ బాధ్యతలు చేపట్టారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మహ్మద్ నయీముద్దీన్‌ను రెయిన్‌బజార్ పీఎస్ డీఐగా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శుక్రవారం స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

'విద్యార్థులకు అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం'

చార్మినార్: విద్యార్థులను పాఠ్య పుస్తకాలలోని అంశాలకే పరిమితం చేయకుండా, అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని సిటీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ శారద అన్నారు. బరాబరి కలెక్టివ్ అనే స్వచ్ఛంద సంస్థతో ఉన్న ఒప్పందంలో భాగంగా ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు 9 నెలల శిక్షణ కార్యక్రమం గురించి అవగాహన కల్పించామని తెలిపారు. విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుని వెళ్లేలోపు శిక్షణ ముగించుకుని, ఉద్యోగ అవకాశం పొందుతారన్నారు. బరాబరి నుంచి వక్తగా పాల్గొన్న హరిహరన్ మాట్లాడుతూ..శిక్షణలో చురుకుగా పాల్గొనే విద్యార్థులకు ప్రోత్సాహకంగా లాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసియా, జయదేవ్, రుచిత, షణ్ముక్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో ఎమ్మెల్యే కౌసర్ పర్యటన



గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే ప్యాచ్‌వర్క్‌లు చేయించామని ఎమ్మెల్యే కౌసర్ మొహియద్దీన్ అన్నారు. శుక్రవారం బల్దియా ఉన్నతాధికారులతో కలిసి టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ, కార్వాన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా టోలిచౌకీ చౌరస్తా, టూంబ్స్ రోడ్డు, బగ్దాద్ కాలనీ, నయాకీలా తదితర ప్రాంతాల్లో వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అవసరమైన చోట సహాయక చర్యలకు డీఆర్ఎఫ్ టీమ్‌లను పిలిపించాలని బల్దియా అధికారులను కోరారు. పలుచోట్ల రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయని యుద్ధప్రాతిపదికన వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ఆయన వెంట బల్దియా ఈఈ రత్నాకర్, లాల్‌సింగ్, రామకృష్ణ, ఉదయ్‌కుమార్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది'



బుల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, మంత్రి వివేక్

గోల్కొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర మంత్రి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి జి.వివేక్ అన్నారు. శుక్రవారం ఆయన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్‌లోని పలు బస్తీలలో పర్యటించారు. ముందుగా వారు విరాట్‌నగర్‌లోని బుల్కాపూర్ నాలాను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి శాశ్వత విముక్తి కల్పిస్తామన్నారు. అనంతరం వారు మినీ బృందావన్, హకీంషా కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ముంపు బాధిత ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిజాముద్దీన్ తదితరులున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవాల బ్రోచర్ విడుదల చేస్తున్న కార్పొరేటర్ బోయిని దర్శన్ తదితరులు

జియాగూడ: బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారిని వివిధ రూపాలలో భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించడం హర్షణీయమని కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. శుక్రవారం లక్ష్మీ నర్సింహనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో ప్రతినిధి ఎం.సాయికాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉత్సవాల బ్రోచర్ విడుదల కార్యక్రమంకు హాజరై పూజలు నిర్వహించి విడుదల చేశారు. అనంతరం ఆలయ ప్రతినిధి సాయికాంత్ మాట్లాడుతూ..ప్రతిరోజు అమ్మవారికి తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, అఖండ హారతి, తీర్థ ప్రసాద వితరణలు ఉంటాయన్నారు.